నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, మంగళవారం 16 ఏప్రిల్ 2024 | NALGONDA

## నామినేషన్ల ప్రక్రియలో నియమాలు ఉల్లంఘించొద్దు

- నల్లగొండ ఎస్పీ చందన దీప్తి

నీలగిరి, ఏప్రిల్ 15 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని నల్లగొండ ఎస్పీ చందన దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ దాఖలు చేయడానికి అభ్యర్థి ఊరేగింపు ర్యాలీ రిటర్నింగ్ కార్యాలయం నుంచి 100 మీటర్ల దూరం వరకే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం రావడానికి కేవలం మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, నామినేషన్ దాఖలు చేసేందుకు ఐదుగురికి మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. వాహనాలకు అభ్యర్థి ముందస్తు అనుమతి తీసుకోవాలని, అందుకు రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఒరిజినల్ కాపీ ప్రదర్శించాలని, వాహనం ముందు అద్దంపై పర్మిట్ నంబర్, అభ్యర్థి పేరు, వాహనం నంబర్ ఎవరికి జారీ చేశారో కచ్చితంగా ఉండాలని పేర్కొన్నారు. ఒక అభ్యర్థి తీసుకున్న పర్మిట్ మరొక అభ్యర్థి ఉపయోగించవద్దని తెలిపారు. ఎవరైనా కోడ్‌ను ఉల్లంఘిస్తే సెక్షన్ 188 ఐపీసీ ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951 సెక్షన్ 129 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి కేటీఆర్ అభినందనలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 15 : సహకార సంఘంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగానికి అందించిన సేవలకుగానూ జాతీయ స్థాయిలో ఉత్తమ డీసీసీబీ అవార్డు అందుకున్న ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అభినందించారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో సోమవారం కేటీఆర్‌ను ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.



గొంగిడి మహేందర్‌రెడ్డిని అభినందిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, పక్కన మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

# కాంగ్రెస్ మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి

### గులాబీ జెండాతోనే తెలంగాణ హక్కుల సాధన

- పంటలు ఎండుతుంటే మంత్రి కోమటిరెడ్డి ఎటు పోయిండు?
- రైతులు లాగులు పీకుతారని రావడం లేదా..?
- జిల్లాలో మళ్లీ 2014 ముందటి పరిస్థితులు
- క్యామ మల్లేశ్‌ను పార్లమెంట్‌కు పంపించాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి
- భువనగిరిలో బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం





భువనగిరి సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వేదికపై బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ప్రజల కోసం, రాష్ట్ర హక్కుల కోసం కొట్లాడడం ఒక్క కేసీఆర్, గులాబీ జెండాతోనే సాధ్యమవుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. భువనగిరిలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మళ్లీ కాంగ్రెస్ గెలిస్తే దున్నపోతు మీద వాన పడ్డట్టేనని, రాష్ట్రాన్ని పట్టించుకునే నాథుడే ఉండరని అన్నారు. ఎన్నికలు కాంగ్రెస్ పాలనకు రెఫరెండం అంటున్నారని, పొరపాటున గెలిపిస్తే.. హామీలు అమలు చేయకున్నా ప్రజలు మద్దతు పలికారని చెప్పుకొని పూట గడుపుతారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష అని, ఆయన సిరిసిల్ల పర్యటకు వెళ్తే భయపడి, కాళేశ్వరం జలాలను తెల్లారే విడుదల చేశారని చెప్పారు. బీజేపీకి ఓటేస్తే కాంగ్రెస్‌కు వేసినట్లేనని, బీఆర్ఎస్‌కు ఓటేస్తే తెలంగాణ ప్రజల ఆకాంక్షకు మద్దతు తెలిపినట్లేనని అన్నారు. కేసులకు బీఆర్ఎస్ భయపడదని, రేవంత్ రెడ్డికి 50వేల మంది పోలీసులు ఉండొచ్చని, కానీ కేసీఆర్‌కు 50లక్షల గులాబీ సైన్యం ఉన్నదని చెప్పారు. బీజేపీ గుజరాత్ మోడల్ అని గొప్పలు చెప్పుకొంటున్నదని, గుజరాత్ మోడల్ అంటే ఊచకోత, హింస, రేప్‌లు, రేప్‌లు చేసినోళ్లను జైలు నుంచి విడుదల చేయించడమేనని, ఇది తెలంగాణకు అవసరమా అని ప్రశ్నించారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి సమస్యలపై బీజేపీ ఒక్క సారి కూడా స్పందించలేదని మండిపడ్డారు.

### యాదాద్రిలో మళ్లీ 2014 ముందు నాటి పరిస్థితులు

యాదాద్రి భువనగిరి జిల్లాలో మళ్లీ 2014 కంటే ముందున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని, నిత్యం దొంగతనాలు జరుగుతున్నాయని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ప్రతి రోజూ దొంగతనాలు జరుగుతుంటే మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. '20 రోజుల నుంచి మంత్రి కనిపించకుండా పత్తాలేరు. విద్యుత్ లోఓల్టేజీతో మోటర్లు కాలిపోతున్నాయి. పంటలు ఎండుతుంటే ఎక్కడ ఉన్నావ్..? రైతులు నీ లాగులు పీకుతారని రావడం లేదా..?' అని దుయ్యబట్టారు.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు

### క్యామ మల్లేశ్ మంచి మనిషి..

కేడర్ ప్రజల్లోకి వెళ్లాలని, గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతులను చేయాలని జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, మోసం చేసిన తీరును ఎండగట్టాలని సూచించారు. రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, ఇస్తే కాంగ్రెస్‌కు ఓటేయాలని, ఇవ్వకుంటే బీఆర్ఎస్ ఓటేయాలనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. విద్యార్థులకు రూ. 5లక్షల కార్డు ఇస్తామని వంచన చేశారని, గ్రామాల్లో ప్రచారానికి వస్తే కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే కాంగ్రెస్ హామీలను ముక్కి పిండి అమలు చేయిస్తారని చెప్పారు. క్యామ మల్లేశ్ మంచి వ్యక్తి అని, ఆయనను పార్లమెంట్‌కు పంపిస్తే ప్రజల కోసం నిరంతర పోరాడుతారని, కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు చెరుకు సుధాకర్, ఒంటెద్దు నర్సింహారెడ్డి, జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, నాయకులు మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, బీరు మల్లయ్య, మొగుల్ల శ్రీనివాస్, అతికం లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ భువనగిరి పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, ప్రధాన కార్యదర్శులు రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నీల ఓంప్రకాశ్‌గౌడ్, నాయకులు దిడ్డికాడి భగత్, ర్యాకల శ్రీనివాస్, బోయిని నర్సింహ, నాగారం సూరజ్, ఆయా మండలాల మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో కాంగ్రెస్ సర్కారు



అసెంబ్లీ ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కానీ నాలుగు నెలలు గడిచినా ఏం చేయాలో తెలియని ఆయోమయ పరిస్థితిలో సర్కారు ఉంది. ఒక పక్క ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం, మరో పక్క ఎండుతున్న పంటపొలాలు, వడగండ్లతో పట్ట నష్టం, కరెంటు కష్టాలు, వడ్ల కొనుగోలు చేయకపోవడం వంటివాటితో రైతులు, ప్రజలకు ప్రభుత్వం ఏం సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నది. అలాంటి కాంగ్రెస్‌ను మళ్లీ గెలిపించి మరింత కష్టాన్ని తెచ్చుకుందామా.. కష్టాలు కడతేర్చిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామా.. అనేది మీరే ఆలోచించి ఓటు వేయాలి. కాంగ్రెస్‌కు ఒక సిద్ధాంతం గానీ, ఒక ఐడియాలజిగానీ లేదు. తన కుర్చీ ఎవరు లాక్కుంటారోననే భయంతో రేవంత్‌రెడ్డి ఉన్నాడు. కేసీఆర్ పాలనలో గత పది సంవత్సరాలు కరెంట్ పోలేదు, ఒక్క మోటర్ కాలిపోలే, ఒక్కదొయ్య ఎండిపోలే. మరి ఇప్పుడెట్ల ఎండుతున్నాయో, కాలుతున్నాయో రైతులు పూర్తిగా ఆలోచించి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలి. నన్ను గెలిపిస్తే గతంలో ఏం జరిగిందో, నేనేం చేస్తానో చూపిస్తా. ఒక్క అవకాశం ఇవ్వండి. బీఆర్ఎస్ గెలిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది.. ఇతర పార్టీలు గెలిస్తే దేశం అభివృద్ధి చెందుతుంది.. ఏది కావాలో ఆలోచించి ఓటు వేయాలి.

– క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి

### గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి



బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలి. గతంలో జరిగిన పొరపాట్లను సరిచేసేకుంటూ ముందుకు సాగాలి. బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలి. పదేండ్లలో గ్రామాలు, పట్టణాల్లో జరిగిన ప్రగతి, కాంగ్రెస్ వచ్చిన తర్వాత ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను తెలియజెప్పాలి. మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే జరిగే అభివృద్ధిని వివరించాలి.

– పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

### కాంగ్రెస్‌తోనే ప్రజలకు ఇబ్బందులు



కాంగ్రెస్ వచ్చిన తర్వాతే అన్ని రంగాల ప్రజలకు ఇబ్బందులు వచ్చినాయి. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఈ ప్రాంతం మళ్లీ అభివృద్ధి చెందుతుంది. ఎంపీ సీటు గెలిపించుకోవడంతోపాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలో గెలుపు దిశగా దూసుకెళ్దాం. కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచిన తర్వాత ఈ ఒక్క రోజు కూడా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోలేదు. పరిష్కరించే దశలో ముందుకెళ్లలేదు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహించాలి. మండల, గ్రామ స్థాయి కమిటీలకు పూర్తి బాధ్యతలు అప్పగించి బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరించాలి.

– ఎలిమినేటి సందీప్ రెడ్డి, జడ్పీ చైర్మన్

### కాంగ్రెస్ నిజరూపం బయటపెట్టాలి



ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలి. 100 రోజులు గడిచినా ఇచ్చిన హామీలను పక్కన పెట్టి మళ్లీ ఎన్నికలకు ఎలా వస్తున్నదో నిలదీయాలి. మాజీ సీఎం కేసీఆర్ బడుగు బలహీన వర్గాలకు ఆరు ఎంపీ సీట్లు ఇస్తే, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ప్రజలకు తెలియజేయాలి. ప్రజలే పూర్తిగా మేము మోస పోయామని తెలుసుకొని కాంగ్రెస్‌కు కర్రు కాల్చి పెడుతారు. ఉమ్మడి జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులకే సీట్లు కావాలని పోటీ పడుతున్నారు తప్ప, అభివృద్ధిని, ప్రజా సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోవడం లేదు. గతంలో గెలిచిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇక్కడ ఎలాంటి అభివృద్ధి చేయలేదు. కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు తీసుకోవడం వరకే సరిపోయాడు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలి.

– బూడిద భిక్షమయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే

### బీఆర్ఎస్‌తోనే ప్రజలకు లబ్ధి



బీఆర్ఎస్‌తోనే గత పది సంవత్సరాలుగా ప్రజలు లబ్ధి పొందారు. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, రైతులు, వివిధ రంగాలకు చెందిన ఎంతో మంది అభివృద్ధి చెందారు. బీఆర్ఎస్ పార్టీ గెలువాలంటే పల్లె ప్రజలదే ప్రధాన పాత్ర ఉంటుంది. మాజీ సీఎం కేసీఆర్ రైతును రాజు చేయాలనుకుంటే, రేవంత్ రెడ్డి రాహుల్‌ను రాజు చేయలనుకుంటున్నాడు. కాంగ్రెస్ వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. మహిళలకు రూ. 2,500 లేవు, రూ.2లక్షల రైతు రుణమాఫీ లేదు. జాతీయ పార్టీలకు ఓటు వేస్తే అభివృద్ధి జరుగదు. అసెంబ్లీ ఎన్నికలే ఇందుకు నిదర్శనం.

– చింతల వెంకటేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

### ఎవరేం చేశారో తెలుసుకోవాలి



భువనగిరి ప్రాంతం బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి చెందుతుంది. గతంలో గెలిచిన ఎంపీ అభ్యర్థులు ఏనాడూ ఈ ప్రాంత అభివృద్ధిపైగానీ, ప్రజా సమస్యలపై గానీ చర్చించలేదు. పరిష్కరించడానికి ముందుకు రాలేదు. ఒకరేమో ఎంపీగా గెలిచి ఈ ప్రాంతాన్ని మరిచిపోయిన వ్యక్తికి టికెట్ ఇస్తే, మరో పార్టీనేమో సస్పెండ్ చేసిన వ్యక్తికి టికెట్ ఇచ్చింది. వారు తమ ఉనికిని కాపాడుకోవడానికి, పార్టీకి కట్టుబడి ఉండడానికి పని చేస్తారు తప్ప ప్రజా సమస్యలు, ఈ ప్రాంత అభివృద్ధికి పనిచేయరు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే ఈ ప్రాంతాభివృద్ధి కోసం సేవ చేయడానికి పరిమితమవుతాడని, అలాంటి వ్యక్తి క్యామ మల్లేశ్‌ని గెలిపించాలి.

–కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు



నకిరేకల్ : చీమలగడ్డ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటా వేసిన ధాన్యాన్ని లోడ్ చేస్తున్న హమాలీలు

## కొనుగోలు కేంద్రాల్లో తరుగు దందా

- 41 కిలోలకు బదులు 42 తూకం వేస్తున్న వైనం
- చీమలగడ్డ సెంటర్‌లో రూ.15,20,240 వరకు స్వాహా

నకిరేకల్, ఏప్రిల్ 15 : మండలంలోని తాటికల్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో చీమలగడ్డ, గోరెంకలపల్లి, మంగళపల్లి, తాటికల్, నెల్లిబండలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వాటిల్లో కొనుగోళ్లు ప్రారంభమై వారం రోజులు అవుతున్నది. అయితే.. మధ్యరాత్రి ధాన్యం కాంటా వేస్తున్నారని, తూకాల్లో తేడాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బస్తాకు 41 కిలోలు తూకం వేయాల్సి ఉండగా.. 42 కిలోలు వేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. ఇదేమిటని రైతులు ప్రశ్నిస్తే సెంటర్ నిర్వాహకులు చెప్తేనే 42 కిలోలు జోకుతున్నామని హమాలీలు చెప్తున్నారు. చీమలగడ్డ పీఏసీఎస్ సెంటర్‌లో 13వ తేదీ వరకు 301 మంది రైతుల నుంచి 69,120 బస్తాల (27,648 క్వింటాలు) ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు తరలించారు. బస్తాకు కిలో చొప్పున తరుగు తీస్తే రూ.22 నష్టం వస్తుంది. సెంటర్‌లోని మొత్తం సేకరించిన 69,120 బస్తాలకు రూ.22 చొప్పున రూ.15,20,640 రైతులకు నష్టం వాటిల్లిందన్నమాట. తరుగు తీస్తున్న విషయాన్ని ఎవరికైనా చెప్తే కాంటా ఆలస్యం చేస్తామని, లోడింగ్ చేయబోమని సిబ్బంది హెచ్చరిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. తరుగు విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించినా ఫలితం లేకుండాపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎక్కువ తూకం వేసిన ధాన్యం డబ్బులు సెంటర్ ఇన్‌చార్జి ఖాతాలోకి వెళ్లాయా.. రైస్ మిల్లర్ల ఖాతాల్లోకి పోయాయా.. పీఏసీఎస్ అధికారుల ఖాతాల్లోకి వెళ్లాయా? అని తేలాల్సి ఉంది. కలెక్టర్ వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

### బస్తాకు 42 కిలోలు తూకం వేస్తుండ్రు



నేను చీమలగడ్డ పీఏసీఎస్ సెంటర్‌కు 31 క్వింటాల (78 బస్తాలు) ధాన్యం 20 రోజుల కింద తీసుకొచ్చాను. బస్తాకు 42 కిలోలు జోకుతున్నరు. 78 బస్తాలకు 1,716 రూపాయలు నష్టపోయిన. కరువులో అంతంతమాత్రంగానే పండిన వడ్లకు ఎక్కువ తరుగు తీస్తే మేం యాడికి పోవాలె.

– కొడదల నాగయ్య, రైతు, తోకబాయిగూడెం

### కిలో తరుగు మా దృష్టికి రాలేదు

చీమలగడ్డ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో బస్తాకు 41 కిలోలు మాత్రమే తూకం వేస్తున్నాం. అప్పడప్పుడు తాలు ఉంటే 50 గ్రాములు తరుగు తీస్తున్నాం. కిలో ఎక్కువ తరుగు తీస్తున్నామన్నది అబద్ధం. వేసవి దృష్ట్యా తెల్లవారుజామున 3 గంటల నుంచి కాంటాలు వేస్తున్నాం.

– శీలం నాగరాజు, చీమలగడ్డ సెంటర్ ఇన్‌చార్జి



నాగార్జున సాగర్ జలాశయం

## డెడ్‌స్టోరేజీకి చేరువైన సాగర్ జలాశయం

- హైదరాబాద్ తాగునీటి సరఫరాపై తీవ్ర ప్రభావం
- ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో తాగునీటికి ఇబ్బంది

హాలియా, ఏప్రిల్ 15 : నాగార్జున సాగర్ జలాశయం డెడ్ స్టోరేజీకి చేరువైంది. ఈ ప్రభావం హైదరాబాద్ జంట నగరాలతోపాటు ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు తాగునీటి సరఫరాపై పడనుంది. నాగార్జున సాగర్ జలాశయానికి వరద నీరు రావడానికి మరో మూడు నెలల సమయం పట్టనుంది. అప్పటి వరకు తాగునీటి అవసరాలు ఎట్ల తీర్చాలనే దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రాజెక్టులో నీటి నిర్వహణ లోపిస్తే మంచినీళ్ల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ ఏడాది కూడా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో సరైన వర్షపాతం నమోదు కాకపోతే, ఎగువ నుంచి వరద నీరు రాకపోతే కృష్ణా పరీవాహక ప్రాంతంలో దారిద్ర్య పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంది.

నాగార్జున సాగర్ జలాశయం రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు వేలాది గ్రామాల్లో కోట్లాది మంది ప్రజలకు తాగునీటి అవసరాలను తీరుస్తుంది. దశాబ్ద కాలం పాటు తాగు, సాగునీటికి కొదవ లేకుండా సిరులు కురిపించిన ఈ జలాశయం గత ఏడాది సరైన వర్షాలు లేకపోవడం, ఎగువ నుంచి వరద రాకపోవడంతో పూర్తిగా నిండలేదు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా, ఈ ఏడాది 540 అడుగులు కూడా దాటలేదు. వానకాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి పంటలను గట్టెక్కించింది. కానీ.. యాసంగిలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించి తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నది.

### మంచినీటి సరఫరాపై తీవ్రప్రభావం

నాగార్జున సాగర్ జలాశయం గరిష్ఠ నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 509.40 అడుగుల నీరు మాత్రమే ఉన్నది. దీంతో హైదరాబాద్ నగరానికి భవిష్యత్‌లో తాగునీటి సరఫరా చేసేందుకు ఇబ్బంది కానున్నది. సాగర్ జలాశయంలో 510 అడుగుల నీరు ఉంటేనే ఏఎమ్మార్పీ ఎత్తిపోతల ద్వారా హైదరాబాద్ నగరానికి తాగునీటిని సరఫరా చేయడం వీలవుతుంది. 510 అడుగుల కంటే తక్కువ ఉంటే నీటిని పంపింగ్ చేయడం సాధ్యం కాదు. పంపింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు తాగునీటికి ఇబ్బంది కానున్నది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్వహణను కృష్ణా రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) చేపట్టిన తరువాత ఇటీవల తెలంగాణ నీటి అవసరాల కోసం ఎడమ కాల్వకు 5 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ తాగునీటి అవసరాల కోసం 5 టీఎంసీల నీటిని విడుదల చేయడం జరిగింది. కాగా, సాగర్ జలాశయం డెడ్ స్టోరేజీకి చేరువైనప్పటికీ 505 అడుగుల నీటి మట్టం వరకు తాగునీటి అవసరాల కోసం వాడుకోవాలని ఇటీవల తెలుగు రాష్ట్రాల అధికారులు ఒక అవగాహనకు వచ్చారు. కానీ.. ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీరు మరో మూడు నెలల వరకు తాగునీటి అసరరాలను తీర్చుతుందా? అన్నది సందేహంగా మారింది. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. గ్రామాల్లో నీటిఎద్దడి నెలకొన్నది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది కూడా మొదటి మూడు మాసాల్లో సరైన వర్షపాతం నమోదు కాకపోతే, ఎగువ నుంచి వరద నీరు రాకపోతే పరిస్థితి ఏంటని అధికారులను వేధిస్తున్న ప్రశ్న.

## అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు జూన్ 5 కల్లా పూర్తి చేయాలి

- 576 పాఠశాలల్లో కమిటీలు ఏర్పాటు
- ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి
- సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 15 : జిల్లాలోని 584 అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు జూన్ 5 కల్లా పూర్తి చేయాలని సూర్యాపేట కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. సూర్యాపేట పట్టణ పరిధి బాషానాయక్‌తండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను సోమవారం కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోని గుర్తించబడిన 584 ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు చదువుకోవాలని ఉద్దేశంతో ప్రభుత్వం వసతుల కల్పన కోసం తాగునీరు, విద్యుత్, బాలికల టాయిలెట్స్ సుందరీకరణ పనులు చేపట్టిందని తెలిపారు. 576 పాఠశాలలో కమిటీలు ఏర్పాటు చేశామని, 555 పాఠశాలల కమిటీలు బ్యాంకు ఖాతాలను ప్రారంభించాయని, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం పిల్లలమర్రి గ్రామంలో పీఏసీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లను చూసి ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తేమ శాతం యంత్రం ద్వారా రైతులు తెచ్చిన ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులు ఆరబెట్టుకొని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న రైతులు ఐరిష్ వల్ల చాలా ఇబ్బందులు గురవుతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ ప్రసాద్, పీఏసీఎస్ అధికారులు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్, సిబ్బంది ఉన్నారు.



పిల్లలమర్రి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతం పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

## శ్రీరామ నవమి వేడుకలకు ఏర్పాట్లు

రామగిరి, ఏప్రిల్ 15 : శ్రీరామ నవమి వేడుకలను ఈ నెల 17న నిర్వహించనుండగా ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. సీతారాముల కల్యాణోత్సవానికి వేదికలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని ఆలయాల్లో చలువ పందిళ్లతో విద్యుద్దీపాలతో అలంకరించారు. శ్రీరామ నవమి కోసం నల్లగొండలో సీతారామ, లక్ష్మణ, హనుమంతుని విగ్రహాలను తయారు చేసి విక్రయానికి రెడీగా ఉంచారు.



నల్లగొండలో విద్యుద్దీపాల వెలుగులో రామాలయం